కథానిక

# ఉదయభానుడి సందేశం

అంగర వెంకటకృష్ణారావు

సార్థకనాముడైన సుబేదార్ భీమ్‌సేన్ ఆవాళ సాయంత్రం నాలుగున్నరకి నావద్దకి వచ్చి 'పద' అన్నాడు. బయల్దేరాం.

భీమసేనుడు నిర్వివాదంగా 78 అంగుళాల పొడవు మనిషి. గత డాక్టరుపరీక్ష రోజుల్లో అతని క్రిందపడి తూనికయంత్రం కిరకిర లాడి, నరాలు త్రెంచుకుని మొహం 250 అంకెలా పెట్టింది. అతడి ఛాతీ మందం ఈ దండెకీ ఆ దండెకీ తగులుతూంటుంది.

మా యిద్దరి స్నేహానికీ చూసిన వాళ్ళందరూ ఆశ్చర్యపోయేవారు. గోలియాత్ ప్రక్కని డేవిడ్ వలె వుంటాను నేను. ఆ మానవాకారుడి అంత వెడల్పైన ఛాతీలోనూ ఒక జాలిగాని, ఒక దుఃఖంగాని లేదు. ఒక్కొక్కప్పుడు కోపము మాత్రము వచ్చేది. అది వచ్చినప్పుడు అతడు నడిచిన నేల బకాసురుడిని చూచిన 'బలి మానవుడు' వలె వణికిపోయేది—ఆ సమయంలో అతడు చూచినదిక్కు సర్వమానవపశువృక్షాల లోని జీవనాడులు నుల్చుకుపోయేవి. ఆ కోపం క్షణికం. కాని ఆకళాందరిద్రాణువు నన్ను మాత్రం మిక్కిలి గౌరవించి, నేను చెయ్యి అన్నపని చేసి వద్దన్నది మానేవాడు—ఒక్కవిషయంలో తప్పిస్తే—అదే—స్త్రీ !

అతడికి ప్రతిరాత్రి స్త్రీ కావాలి. అది జాతితః స్త్రీ అయితే చాలు—అంతే.

అతడు తప్పత్రాగేవాడు. ఒక్కొక్కప్పుడు నాలుగుగంటలకాలం ఎడతెరిపిలేకుండా త్రాగితే అతడి నడినెత్తిమీద దీపాలు వెలుగుతున్నాయేమో, వాటి కళికలు కానవస్తాయేమో అనిపించేది. అతడి నేత్రాలాసమయంలో వనకింశుకాలే.

అటువంటి స్నేహితుడు, నేనూ సంజవేళ 'చిన్‌సురా' చేరుకున్నాం. నేను చూసిన అన్ని ప్రదేశాలలోకి చిన్‌సురా పరిశుభ్రమైన స్థలం. హుగ్లీకి సమీపంలోవున్న స్థలం మరీని. మెట్లు ఎక్కిన దగ్గరనుండీ ఎత్తైన మేడలు - సన్ననివైనా నీటైన వీధులు - నిశ్శబ్దం ఒక అదనపు శోభ. మూడు వీధులు కలిసిన బజారు మంచితీరుగా, సున్నితమైన గంట స్తంభంతో రమణీయంగా వుంటుంది. అది చంద్రనాగోరుకు సామీప్యమే గనక 'వైను'కు కరువులేదు.

భారతవీరుడైన భీమసేనుడు - ఆకాలపు బకాసురుని కన్న పైచెయ్యట - కాని నా మిత్రుడు వారిద్దరికన్న పైచెయ్యి. నాకు భయంగానేవుంది. భోజనం చెయ్యకుండా బయలుదేరాం కదా - ఈ వృకోదరుడికి ఎక్కడ వారం కుదర్చడం అని. సరే కాని - కావలసింది కాకపోదని సమర్థించుకున్నా.

వెళ్ళి అయిదు చపాతీలు, ఒక చికెన్‌కరీ, ఎనిమిది గుడ్లు, రెండు ప్లేట్ల అన్నం, శేరు పాలు! ఇంతకన్న ఎక్కువ పెట్టలేకపోయాడు ఆ బక్క బెంగాలీ హోటలువాడు. దానిమీద పెద్ద రంథి అవబోయింది. మానవాకారుడు కోపపడదాం అనుకుని గొంతు సవరించుకుంటూ, సాదాగా దగ్గితే హోటలు వాడి గుండెకాయ ఆగిపోయింది. నేను మధ్యపడి 'సినీమాకి వేళ అయిపోయింది, పద సుబేదార్ సాబ్' అని అతడిని పైకెనెట్టి, హోటలు వాడి చేతిలో పదిరూపాయిల నోటుపెట్టి బైటపడ్డా.

పదిగంటల రాత్రి. ఘంటాగృహం దాటి తారు రోడ్డు కిరుప్రక్కలా వున్న స్త్రీ, శిశువైద్యాలయాన్ని అధిగమించి నదివేపు నడుస్తూన్నాం. భీమన్న నోటిలోంచి వైను పరిమళం వచ్చినప్పుడల్లా యీఘటం యింత తొందరగా పడవెక్కదు అనిపించేది. నది మెట్లకి కుడివెంపునున్న దిబ్బల మీదికెక్కి ఒక అరఫర్లాంగు నడిచి వెళ్ళాం. హటాత్తుగా 'బాబూజీ! ఉండు యిప్పుడే వస్తా' అని మాయమయేడు మానవాకారుడు.

నే నొకసారి నదివెంపు తిరిగాను-గాలీ మొహా మ్మీదికి జోరుగా కొడుతూంది. అవతలి గట్టున మిల్లులలో దీపకోటి వెలుగుతూంది. ఇవతలి గట్టున నేనున్నదగ్గర గాఢాంధకారం. పైన కోటానకోట్ల నక్షత్రాలు మిలమిల మెరిసిపోతున్నాయి. కాని నదీమతల్లి మాత్రం, ఏమీ తెలియనిదానివలె ఆ చిక్కచీకటిలో, ప్రశాంతగభీర గమనంతో సాగిపోతూంది. ఆ స్రవంతిలోని ప్రతి జలబిందువు అనంతకాలగర్భంలో అణిగిన ప్రతిలిప్తవలె, ప్రకృతి కొట్టిన చాలులోపడి సాగిపోతూంది కామోసు. ఎన్నెన్ని జీవితాలు తన కడుపులో చిదికిపోయాయో ఆగంగకి తెలీదా అని ఒక నిట్టూర్పు విడిచాను. కాని వెంటనే తెలుసును అనిపించింది.

ఒకనాటి సాయంత్రం 5 గంటలకి నది దాటుతున్నాం. వాతావరణం భయంకరంగా వుంది. ఆ 'కిస్తీ'లో అరవంద జీవులున్నాయి. అది నెలాఖరు-జీతాలుముట్టినరోజు. అంతా తప్పత్రాగి వున్నారు. నావనడిపేవాళ్లు అందరికన్న ఎక్కువ త్రాగి వున్నారు. నావ బయలుదేరింది. మేఘాలమాటున సూర్యుడు కానరావడంలేదు. కార్మిక శ్రామికుల రక్తం త్రాగిత్రాగి తెలివితప్పి పడ్డాయి మిల్లులు. గాలిప్రళయోజృంభణంగా వీస్తూంది. నావ నడినీటిలోవుంది. ఈ గంగమ్మ తల్లికి ఆనందం అప్పుడే పరవళ్లు త్రొక్కింది. అరవంద జీవులతోటి నావ అద్భుత నృత్యప్రదక్షిణాలు తిరగడం మొదలెట్టింది. నది, ఒక్కొకచోట కితకితలుపెట్టినట్టు ముక్కముక్కలై పోతూ-మరొక్కచోటగిరగిరతిరుగుతూ, వేరొకచోట ఉవ్వెత్తుగా లేచిపడుతూ - అడుగునుంచే శరవేగ ప్రవాహాలు పుట్టించి విజృంభించసాగింది. నావలోని వారందరమూ నదీ జలాలతో సుస్నాతుల మయ్యాము. నేను మాత్రం ప్రత్యేకముగా మొదట భీతివలన పుట్టిన చమటలో స్నానమాడి, పదపడి మా వాళ్ళనందరినీ తల్చుకుని అశ్రుజలంలో మజ్జనంచేసి, చివరకి నదీ జలాలు తగిలేసరికి జీవన మరణాలకి మధ్య ఇతికర్తవ్యతా మూఢసమాధిలో పడ్డాను. త్రాగిన శ్రమజీవులు నదీ ఘోషనిమించి 'గంగమ్మ తల్లీ! నీదేభారం!' అని అరుస్తూ - తిట్టుకుంటూ, పొగ తాగుతూ, బీహారీ గ్రామ్య కఠోరభాషలో నిరర్థక వివాదాలు పెంచుకుని, ప్రమాదాన్ని మరిచి, అదొక రకం సమాధిలోపడ్డారు — నావ నడిపే వాళ్ళ కండలు తిరిగిన శరీరాలలో ఏ అంగుళం భాగంకూడా కదలికలేకుండా, నావకి ప్రతిలిప్త ఒక పెనుగండంలావుంది. అవతలి గట్టునుంచి జనం గుంపులు గుంపులుగా కూడి పెద్దకేకలేస్తూ, చేతులుత్రిప్పుతూ, ఏవో సౌంజ్ఞలు చేస్తూన్నారు. అడుగు కదలడంలేదు.

అయితే! ప్రమాదం తప్పింది. నావ ఒడ్డెక్కింది. పదినిమిషాలలో ముగియవలసిన ప్రయాణం రెండు గంటలు పట్టింది. అంచేత జరిగే ఘోరాలన్నీ ఈ గంగకి తెలుసు అనుకుంటూ ఆలోచనలో మునిగిన నన్ను 'మానవాకారుడి' అడుగుల చప్పుడు మేలుకొలిపింది.

తిరిగి చూద్దును - ఆ చీకటిలో లేత చుక్కల కాంతిలో మానవాకారుడి ఎడమచంక క్రింద ఒక 'మినియేచర్' మానవాకారం గోచరించినట్టయింది. కుడిచేత్తో భీమన్న నన్ను దగ్గరకి రమ్మని సైగచేశాడు. నేను ఊపిరి బిగబట్టి బొటన వ్రేళ్ళమీద నడుస్తూ దగ్గరకు వెళ్లాను. సుబేదార్ బరువుగా వూపిరితీస్తూన్నాడు—ఆ చీకటిలో అతని కళ్లు చింతనిప్పుల్లా మెరిశాయి. ఆభయంకర పలలాశనుడి చేతిలో ఏ నిర్భాగ్యజీవి చిక్కకుందో కదా అని సమీపించాను. అతడు అటు యిటు చూస్తూ, నెమ్మదిగా నాచెవిలో అన్నాడు. 'బాబూజీ! ఏం చెప్పను! ఎ-స్క-లెం-ట్ జె-ర్డ్ (అంతే అతని యింగ్లీషు)—నాలాంటి పశువులకి కాదు యీ సీతాకోక చిలక-నీవంటి పువ్వులాంటి వాడికి-దేఖో! దేఖో!' అంటూ పంట్లాం కుడి జేబులోంచి టార్చితీసి చేతిగుడ్డ చుట్టి ముఖంమీద లైటువేశాడు.

నాహృదయం జివ్వుజివ్వు మంది. రెండుసార్లు నుదుటంట శ్రమజలబిందువులు జొట జొట కారాయి. 'మేఘాలమాటున దాగున్న ఓ పిరికిపందవైన దైవమ్మన్యుడా! చూడు, నిన్ను సవాల్ చేస్తూన్న మానవాకారుడు!' అంది నామనస్సు ఆ రహస్యంలోకి దృష్టిపొడిచి.

ఆ పసిరిక నేలమీద ఆకాశంమీంచి తెగిపడిన శుక్రతారలా నిస్పృహగా పడివుంది ఆ వ్యక్తి-ఆ కోమలి నిమీలిత నేత్రాలపై, వంపు తిరిగిన గులాబిరేకులవంటి పెదవులమీద, నాజూకు

గర్వించూపే గడ్డంపై, దయాభిక్ష కోరుతూన్న ఒక దీనత్వం గోచరిస్తూంది.

ఆమె నిరాభరణ నిసర్గ దివ్య సౌందర్యం 'మానవాకారుని'లో ఆశ్చర్యకరంగా, హఠాత్తుగా నిజమైన మానవత్వం చిగిర్పించిన కామోను, భీమసేనుడు మలిచిన అనోమయ విగ్రహం వలె నిస్పృహుడోయి నిల్చున్నాడు. త్రైటు ఆర్మీ నా వేపుచూసి రుద్ధ కంపిత కంఠంతో 'పద, బాబూజీ' అన్నాడు.

తెల్లవారి 5½కి నన్ను రమ్మని బట్రోతు ద్వారా కబురు పంపాడు. నేను మళ్ళీ 'నమస్తే - సుబేదార్ సాబ్!' అన్నాను నవ్వుతూ. అతడు మాత్రం నిరుత్తరంగా, తూర్పు వెంపు తదేక తీవ్ర దృష్టితో చూస్తున్నాడు. ఇంకా రాత్రివిషయమే అతడిని బాధిస్తూందేమో అని 'దానికేం సాబ్! అదొక పొరపాటు - దానికింత విచారించాలా - ఇంతకీ మనం చివరకి మంచిగానే వచ్చాం కదా!' అన్నా. అతడు తెరచిన ఒక కవరు నామీద విసిరి ఒక నిట్టూర్పు విడిచాడు.

ఆది పంజాబ్‌లో గుజరాత్ జిల్లానుంచివచ్చిన లేఖ. అతడి కుటుంబం దెబ్బనుంచి మనుష్యులకి పదకొండుగురు మతోన్మాదాగ్నికి ఏకకాలంలో ఆహుతియినారు. తన చెల్లెలు పది హేను ఏండ్ల పడుచు నదిరొడ్డు మీద మానభంగం పొందబడానికి సిద్ధంగావున్న సమయంలో తననౌగాం ఎరిగిన ఒకడు ప్రాణాలకి తెగించి ఆమెని రక్షించి తన యింటివద్ద (సురక్షితమైన వేరొక జిల్లాలో) కాపాడుతూన్నాడని ఆ వుత్తరం వల్ల తెలుస్తూంది.

దూరంగా రైలుపట్టీల కవతల మామిడిచెట్ల మొదళ్లలోంచి లేచి నవారుణకిరణం ఒకటి సూటిగావచ్చి 'మానవాకారు'డి నిర్లిప్తనయన గోళాలని తాకేసరికి రెండు ఖరీదైన కన్నీటి బొట్టులు బుగ్గలమీద తళతళ మెరిశాయి——

'బాబూజీ? నిన్నటి అమ్మల్లి —అచ్చంగా మా చెల్లెలే—మూడుమూర్తులా' అని వలవల ఏడ్చాడు.

నేను ఉదయభానుడివెంపు చూశాను, 'ఎన్ని కోట్ల జీవులకిలా సందేశం అందజేస్తావు తండ్రీ!' అని.



జెమినీవారి "చక్రధారి" తమిళచిత్రంలో శ్రీయుత నాగయ్య, అభినేత్రి సూర్యప్రభ. గోరాకుంభార్ అనే మహారాష్ట్రభక్తుని జీవితగాథను చిత్రించే యీ ఫిలుము ఆంధ్రదేశపు కేంద్రాలలో సంక్రాంతికి విడుదల కానున్నది.